ప్రజాశక్తి

సోమవారం 2 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



ముగిసిన ఉక్కు రక్షణ యాత్ర

- చివరి రోజూ అదే ఉత్సాహం.. ఉత్తేజం...
- 5న బహిరంగసభకు తరలిరండి
- సిపిఎం నాయకుల పిలుపు

ప్రజాశక్తి-ఆరిలోవ, సింహాచలం, గోపాలపట్నం, పెందుర్తి

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గత నెల 20న ప్రారంభమైన 'ఉక్కు రక్షణ యాత్ర' ఉత్తరాంధ్ర అంతటా 12 రోజులు సాగి ఆదివారం పెందుర్తి మండల పరిధి చినముషిడివాడ బహిరంగసభతో ముగిసింది. ఆదివారం యాత్ర ఆరిలోవలో ప్రారంభమై తోటగరువు, బిఎన్ఆర్.నగర్, డెయిరీఫాం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, టిఐసి పాయింట్, దుర్గాబజార్, రామకృష్ణాపురం, సింహాచలం, గోపాలపట్నం, ఆర్ఆర్ వెంకటాపురం, అప్పలనరసయ్య కాలనీ, అప్పన్నపాలెం, వేపగుంట, కృష్ణరాయపురం, పురుషోత్తపురం మీదుగా చినముసిడివాడ వరకు సాగింది.

ఆరిలోవ నుంచి ప్రారంభమైన ఉక్కు రక్షణ యాత్రకు అడగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ఆరిలోవ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వాగతం పలికారు. సిపిఎం చేపట్టిన ఈ యాత్ర స్టీల్‌ప్లాంట్ రక్షణకోసమే కాదని, ప్రజల జీవితాలకోసం అని చెప్పారు. అక్కడి నుంచి తోటగరువు కొండ, బిఎన్ఆర్.నగర్ చేరుకుంది. కాలనీ ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం డెయిరీ ఫారం మీదుగా ఆదర్శనగర్, రవీంద్రనగర్, టిఐసి పాయింట్‌కు చేరుకుంది. అక్కడ ఐద్వా కార్యదర్శి ఎస్.రంగమ్మ నాయకత్వంలో మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అక్కడి నుంచి దుర్గాబజార్, 40గజాలు, రామకృష్ణాపురం చేరుకుంది. రామకృష్ణాపురంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ నాయకులు ఆదినారాయణ నాయత్వంలో గ్రామస్తులు హారతులిచ్చి, పూలుజల్లి మందుగుండు సామాగ్రి పేల్చి స్వాగతం పలికారు. అక్కడ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, అల్లూరి విగ్రహాలకు పూలదండలు వేశారు. ఈ యాత్రలో ప్రజానాట్యమండలి కళాకారులు తమ పాటలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. అక్కడి నుంచి అడవివరం మీదుగా సింహాచలం చేరుకుంది. సింహాచలంలో మిగతా 2లో..

వరి సాగు 78 శాతమే...!

- 50 శాతంలోపు నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి మండలాలు
- సెప్టెంబరు 15 తరువాత ముదిరిన ఆకుతో ఉడుపులు
- పంట దిగుబడులు అనుమానమే

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో కొనసాగిన వర్షాభావ పరిస్థితులు వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. సెప్టెంబర్ 30వ తేదీ వరకు పంట సాగు నమోదు చేసినా 78 శాతం మించలేదు. సాగు నీటి వనరుల్లేక పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సగం కూడా పంట వేయలేదు. అక్కడక్కడా కురిసిన వర్షాలకు వేసిన పంటలు నీరులేక ఎండిపోతున్నాయి. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు లక్ష ఆరువేల ఎకరాల్లో (78 శాతం) పంట నమోదైంది. జూన్ ఒకటి నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు 694.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా, 609.5 మిల్లీమీటర్లు కురిసింది. -12.3 శాతం వర్షపాతం లోటువుంది. పది మండలాల్లో వర్షపాతం లోటు వుంది. పరవాడ, అనకాపల్లి, మాకవరపాలెం, మునగపాక, అచ్యుతాపురం, యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాల్లో ఆది నుంచి వర్షపాతం లోటు కొనసాగుతోంది. సాగైన పంటలో దాదాపు సగం పంట లెక్కకు తప్ప దిగుబడులు వచ్చే అవకాశంలేదు. సెప్టెంబరు 15వ తేదీ తరువాత చేసిన ఉడుపుల్లో



నక్కపల్లి మండలం, సీతమ్మపాలెంలో ఎండిన ఆకు మడులను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

50 నుంచి రెండు నెలలు దాటిన ముదిరిన ఆకులు ఎక్కువగా ఉన్నాయి. ముదిరిన ఆకు ఉడుపులు చేయడంతో చేతికి పంట వచ్చే అవకాశం తక్కువని రైతులు చెబుతున్నారు. సగం కంటే ఎక్కువ విస్తీర్ణంలో నమోదైన పంటను చూపి కరువు పరిస్థితులు లేవని ప్రభుత్వం చెప్పేందుకు సెప్టెంబరు 30వ తేదీ వరకు పంట లెక్కలను పరిగణనలోకి తీసుకుంది. తాండవ, రైవాడ, కోణాం, పెద్దేరు జలాశయాల కిందవున్న 75,414 ఎకరాల ఆయకట్టుకు 57,037 (82 శాతం) ఎకరాల్లో వరి పంట రైతులు వేయగలిగారు. పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయలేకపోవడంతో వరి పంట 82 శాతానికి మించి మిగతా 2లో..

జగనన్న కాలనీ లే-అవుట్‌లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

▶ వార్త 5లో..

నేటి నుంచి కాశ్మీరీ యువ సమ్మేళనం

▶ వార్త 2లో..

సీలేరులో 129 కిలోల గంజాయి పట్టివేత

▶ వార్త మెయిన్‌లో..

పరిహారం చెల్లించేవరకూ భూముల జోలికి రావద్దు

▶ వార్త 8లో..

కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులు

జిల్లా కలెక్టర్ మల్లికార్జున



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కళలను, కళాకారులను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాలను, సబ్సిడీలను, సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకునేందుకు, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉపయోగపడే విధంగా రాష్ట్రస్థాయి గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ కళారూపాల కళాకారులు తమ పేరు, తండ్రిపేరు, జెండర్, పుట్టిన తేది, బ్లడ్ గ్రూపు, శాశ్వత చిరునామా, ప్రావీణ్యత ఉన్న కళ, సంబంధిత కళలో అనుభవం, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు, ఇ-మెయిల్ తదితర వివరాలతో, రెండు పాస్ పోర్టు ఫోటోలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఉపసంచాలకులు, విశాఖ జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయానికి ఈ నెల 8వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖా కార్యాలయంలో ఎవి సూపర్‌వైజర్‌ను (9441249410) సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీలతో రైతులకు మేలు

జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి రవికిరణ్

ప్రజాశక్తి- అనకాపల్లి

భారతదేశంలో సుమారు 70 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. వారు పండించిన పంటను వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా అమ్మకాలు సాగిస్తుంటారు. ఈ ప్రపంచంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మార్కెటింగ్‌ను భారతదేశంలో 1962 ఫిబ్రవరి 1 స్థాపించారు. ఆంధ్రప్రదేశ్‌లో 1966 నవంబర్ 18 నుంచి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ చట్టం అమల్లోకి వచ్చింది. నాటి నుంచి రాష్ట్రంలో తాము ఏర్పాటు చేసుకున్న నియమ నిబంధనల ప్రకారం వ్యవసాయ మార్కెట్ కమిటీలు లావాదేవీలు కొనసాగిస్తూ ఉన్నాయి. వ్యాపారలావాదేవీలపై ఒక శాతం సెస్సు ద్వారా వచ్చిన ఆదాయంతో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి రవి కిరణ్ ప్రజాశక్తితో ముఖాముఖి...

జిల్లాలో ప్రస్తుతం ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఎన్ని, ఎక్కడెక్కడ ఉన్నాయి ?

ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వాటిలో నాలుగు ప్రధాన మార్కెట్ యార్డులు కాగా రెండు సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట, మాడుగుల నియోజకవర్గాల్లో ఈ వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి.



వీటిలో చోడవరం, వడ్డాది, మాడుగుల మార్కెట్ కమిటీలు తిమిరాంలో సబ్ మార్కెట్ కమిటీలు ఉన్నాయి.

మార్కెట్ కమిటీలు ఎంతెంత విస్తీర్ణంలో ఉన్నాయి ?



అనకాపల్లి ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డ్ (బెల్లం మార్కెట్) 33.27 ఎకరాల్లో, నర్సీపట్నంలో 12.15 ఎకరాలు, చోడవరంలో 11.47 ఎకరాలు, పాయకరావుపేటలో 4.86 ఎకరాలు, మాడుగులలో 9.64 వెరసి మొత్తం 82.35 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి.

వ్యవసాయ మార్కెట్ మిగతా 2లో..

ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విఎస్ఎఫ్ఏ ఆధ్వర్యాన మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఫిలిం డైరెక్షన్ వర్క్ షాప్ ఆదివారం ప్రారంభమైనట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్స్ ఇన్‌ఛార్జి జివిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఈ మూడు రోజుల వర్క్ షాప్‌లో మొదటి రెండు రోజులు డైరెక్షన్‌పై క్లాసు నిర్వహించి, మూడవ రోజు హాజరైన వారు నేర్చుకున్న అంశంతో, రెండు నిమిషాలు లఘు చిత్రాలు నిర్మించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ అష్రఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరం నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి మొత్తం 50 మంది కళాకారులు పాల్గొన్నారని కార్యదర్శి ఎల్లాజీ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డిఎంవి.రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురజాడ సాంస్కృతిక వేదిక కన్వీనర్ దండు నాగేశ్వరరావు, కుమార్ రాజ్, దిలీప్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గాంధీ జయంతి సందర్భంగా సోమవారం అక్కయ్యపాలెం రామచంద్ర నగర్ 4వ లైన్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తనతో పాటు డాక్టర్ వి.మన్మథరావు, డాక్టర్ ఆనందకుమారి సేవలందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖపట్నంలో మానవ వనరుల లభ్యత గురించి విశ్వవ్యాప్తంగా ప్రచారం చేస్తేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పల్సర్ సీఈవో గేదెల శ్రీనుబాబు పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తేనే ఆ ప్రాంతం అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. సత్యం జంక్షన్‌లోని పల్సస్ సంస్థలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో డాక్టర్ శ్రీనుబాబు మాట్లాడారు. వృత్తి నిపుణుల లభ్యత ఈ ప్రాంతంలో ఎంతో ఉందని, జి20 సదస్సులోను, గ్లోబల్ టెక్ సమ్మిట్ లో ఈ విషయాన్ని అందరికీ తెలిసే విధంగా ప్రచారం చేశామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఐదు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ కోర్సులు పూర్తి చేసుకుని బయటికి వస్తారని వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా పల్సస్ సంస్థ ప్రణాళిక సిద్ధం చేస్తోందని తెలిపారు. కొత్తగా కంపెనీలు ఏర్పాటు చేసే వారికి నైపుణ్యమైన అభ్యర్థులను అందజేసేందుకు శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. దీనికి ప్రభుత్వ సహకారం ఉండాలన్నారు. విశాఖలో వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో తాము పని చేస్తున్నామన్నారు.

4న వివిధ మతాల దేవాలయాల సందర్శన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బాల వికాస ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యాన మత సామైక్యత అవసరం గురించి అవగాహన కలిగించే చర్యలలో భాగంగా బుధవారం నగరంలోని వివిధ మతాల దేవాలయాల సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నామని నరవ ప్రకాశ రావు తెలిపారు.

నవంబర్ 14, 15 తేదీల్లో బిర్సా ముండా జయంతి వేడుకలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు బిర్సా ముండా 149వ జయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో నవంబర్ 14, 15 తేదీలలో జాతీయ స్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వెల్లడించింది. విశాఖ ఎంవిపి కాలనీలో గల గిరిజన భవనంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ రామారావు దొర మాట్లాడుతూ, ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల ఆదివాసీ ప్రతినిధులు సుమారు 500 మంది పాల్గొనున్నారని తెలిపారు. ఆదిమ జాతులు సంప్రదాయకమైన సాంస్కృతిక కళా బృందాలతో పాల్గొంటారని వివరించారు. రెండు విభాగాలుగా జరిగే ఈ వేడుకలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 5వ షెడ్యూల్ అధికారాల అమలు ఉమ్మడి పౌరస్మృతి, నూతన అటవీ సంరక్షణ సవరణ చట్టం, జనగణనలో ఆదివాసులకు ప్రత్యేక కాలం, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వంటి జాతీయంగా ప్రభావం చూపే అంశాలతో పాటు జిఒ 3 రద్దు, 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టం, పీసా, సమత జడ్జిమెంట్ తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

ముగిసిన ఉక్కు రక్షణ యాత్ర

సిపిఎం నాయకులు, సానుభూతిపరులు హారతులతో స్వాగతం పలికారు. సింహాచలం ప్రధాన కూడలి వద్ద బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం గోపాలపట్నం యాత్ర సాగింది. గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి వద్ద సభ నిర్వహించారు. అనంతరం ఎన్ఎడి కొత్త రోడ్డు, విమాన్‌నగర్, ఎల్లపువానిపాలెం, కొత్తపాలెం, నందమూరినగర్ మీదుగా వేపగుంట వైపు కొనసాగింది. ఆర్ఆర్.వెంకటాపురం, అప్పలనరసయ్య కాలనీ, అప్పన్నపాలెం, వేపగుంట, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, చిన ముసిడివాడ వరకు యాత్ర వర్షంలోనే కొనసాగింది. మహిళలు హారతులిచ్చి, పూలదండలతో స్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల్లో సభలనుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. విశాఖ అభివృద్ధికి ప్రభుత్వ రంగ పరిశ్రమలే కారణం అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడం లేదని ఇక్కడి నాయకులు చెబుతుంటారని, ఎప్పుడో అమ్మేశామని కేంద్రంలోని నాయకులు చెబుతుంటారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్నామని చెబుతున్నా రాష్ట్రానికి చెందిన ఎంపీలు సభలో కనీసం నోరెత్తడం లేదన్నారు. పవన్ కల్యాణ్ కూడా మోడీకి వంతపాడుతున్నాడే తప్ప స్టీల్‌ప్లాంట్ కోసం గట్టిగా గళం విప్పడం లేదన్నారు. కూర్మన్నపాలెంలో ఈ నెల 5వ తేదీన చేపట్టే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంల్లో సిపిఎం నాయకులు బి.జగన్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.ప్రభావతి, బి.రమణి, వి.నరేంద్రకుమార్, పి.శంకర్, ఎస్.రంగమ్మ, ఎస్.గౌరి, నాగరాజు, రమణ, నారాయణమూర్తి, తులసీరాం, మోహన్‌రావు, సత్యనారాయణ, ఐసి నాయుడు, శేషయ్య, పి.వెంకటరెడ్డి, నూకరాజు, బలివాడ వెంకటరావు, ఊరుకోటి రాజు, ముద్దాడ వరప్రసాద్, టివి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం నాయకులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

వరి సాగు 78 శాతమే...!

నమోదుకాలేదు.

తాండవ జలాశయం ఆయకట్టు 32,689 ఎకరాలకు 22,140 ఎకరాల్లో వరి పంట సాగైంది. రైవాడలో 15,344 ఎకరాలకు 13,900 ఎకరాలు, కోణాంలో 12,276 ఎకరాలకు 10,650 ఎకరాలు, పెద్దేరులో 15,105 ఎకరాలకు 10,347 ఎకరాల్లో పంట నమోదైంది. తీవ్ర వర్షాభావంతో నక్కపల్లి మండలంలో 5,125 ఎకరాలకు 1212 ఎకరాల్లో (24 శాతం) రైతులు పంట వేశారు. పాయకరావుపేట మండలంలో 7,920 ఎకరాలకు 2,855 ఎకరాల్లో (36 శాతం), రాంబిల్లి మండలంలో 6,815 ఎకరాలకు 3,130 ఎకరాల్లో (46 శాతం) పంట నమోదైంది. జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు 2021 సెప్టెంబరు 30వ తేదీ నాటికి 1,40,452 ఎకరాలు, 2022లో 1,45,655 ఎకరాల వరి పంట నమోదుకాగా, ఈ ఏడాది 1.06 లక్షల ఎకరాల్లో వరి పంట నమోదైంది.

వ్యవసాయ మార్కెట్ కమిటీలతో రైతులకు మేలు

కమిటీలు ఎన్ని మండలాలను కవర్ చేస్తున్నాయి ?

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ అనకాపల్లి, కశింకోట మండలాలు, నర్సీపట్నంలో నాలుగు, ఎలమంచిలిలో నాలుగు, చోడవరంలో 4, పాయకరావుపేటలో నాలుగు, మాడుగులలో 4 మండలాలకు సంబంధించి సేవలను అందిస్తున్నాయి. ఆయా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వ్యాపారులకు విక్రయిస్తుంటారు.

చెక్ పోస్టుల ఏర్పాటు ఎలా ఉంది ?

ఆరు నియోజకవర్గాల్లో 9 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. చెక్‌పోస్టుల ద్వారా వివిధ ప్రాంతాలకు వాహనాల ద్వారా సరుకు రవాణా చేసే వారి నుంచి రుసుం వసూలు చేస్తున్నాం.

టార్గెట్లు ఉంటాయా ?

ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా ఒక శాతం సెస్సు ద్వారా వచ్చిన ఆదాయంతో మార్కెట్ కమిటీల నిర్వహణ ఉంటుంది. 2020- 21 లో రూ.1063.20 లక్షలకు గానూ రూ.323.25, 2021 -22లో రూ.992 లక్షలకు గానూ రూ.637.01, 2022- 23 ఆర్థిక సంవత్సరంలో రూ.1,020 లక్షలకు గానూ రూ.839.70, 2023 -24 సంవత్సరంలో రూ.1000 లక్షలకు గానూ ఇంతవరకు రూ.347.05 లక్షల ఆదాయం వచ్చింది.

రైతు బజార్లు ఏర్పాటు చేస్తున్నారా ?

రైతు బజార్లు ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నాం. అనకాపల్లిలో స్థల సేకరణకు ప్రయత్నం జరుగుతోంది. నర్సీపట్నంలో ప్రస్తుతం రైతు బజారు వ్యవసాయ మార్కెట్ కమిటీలోనే కొనసాగుతోంది.

రైతులకు గొడౌన్లు నిర్మిస్తున్నారా ?

రైతులు పండించిన పంటను నిలువ చేసుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వీలుగా గొడౌన్లు నిర్మించేందుకు ప్రభుత్వం నిశ్చయించింది. దీనిలో భాగంగా మొదటి దశలో 16 మంజూరు కాగా రెండు పూర్తయి, 9 గ్రౌండ్ లెవెల్లో ఉన్నాయి. మిగిలిన వాటికి స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నాం. రెండో దశలో 12 అనుమతి రాగా గుర్తిస్తున్నాం. మూడవ దశలో 153 గొడౌన్లకు అనుమతి వచ్చింది. వీటిలో 62 గోడౌన్లకు స్థలాలు గుర్తించాము. మిగిలినవి గుర్తించాల్సి ఉంది. ప్రస్తుతం ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 13 గొడౌన్లు 9522 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్నాయి.

నేటి నుంచి కాశ్మీరీ యువ సమ్మేళనం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : మహా విశాఖ నగరంలో మొట్ట మొదటిసారిగా సోమవారం నుంచి కాశ్మీరీ యువ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకె) ఉమ్మడి జిల్లా జి.మహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే ఈ యువ సమ్మేళనంలో 120 మంది కాశ్మీర్ యువతీ యువకులు పాల్గొంటారని చెప్పారు. ఎన్‌వైకె పరిపాలనాధికారి అల్లం రాంప్రసాద్‌తో కలిసి యూత్ హాస్టల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో యువ సమ్మేళనం వివరాలను ఆయన వెల్లడించారు. కాశ్మీరీ యువతకు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి యువ సమ్మేళనంలో వివరిస్తారన్నారు. కాశ్మీర్‌లోని అనంతనాగ్, కుప్వారా, బారాముల్లా, బుద్గం, శ్రీనగర్, పుల్వామా జిల్లాల నుంచి 120 మంది యువత, 12 మంది టీమ్ లీడర్లు విశాఖ వస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో భాగంగా విశాఖపట్నంలోని ముఖ్యమైన సందర్శనీయ ప్రదేశాలను సందర్శిస్తారని తెలిపారు.

పుస్తక పఠనంతో భాషా పరిజ్ఞానం



మాట్లాడుతున్న అనసూయాదేవి

ప్రజాశక్తి -ములగాడ: పుస్తకాల చదవడం వల్ల భాషా పరిజ్ఞానం పెంపొంది, ఆలోచనాశక్తి విస్తృతమౌతుందనిజాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతి ఆదివారం విద్యార్థులు శాఖా గ్రంథాలయానికి వచ్చి వివిధ రకాల పుస్తకాలను చదవడం ప్రశంసనీయమన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు నీతి కథలను, చందమామ కథలను, పద్యాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారన్నారు. తమ గ్రంథాలయంలో బాలలకు ప్రత్యేక విభాగం ఉందన్నారు. అనంతరం మల్కాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, విజ్ఞాన టాలెంట్ స్కూల్ తదితర పాఠశాలల విద్యార్థులు కథల పుస్తకాలు, దేశ నాయకుల చరిత్రలను ఆసక్తిగా చదివారు. స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి , రచయిత కె. సత్తిరాజు పాల్గొన్నారు.

వంద సచివాలయాల్లో గడపగడపకూ...

ఎమ్మెల్యే ముత్తంశెట్టికి సుబ్బారెడ్డి అభినందన



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలో వంద సచివాలయాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేయడం అభినందనీయమని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు ఆదివారం పెద్దిపాలెం చెన్నా ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలకులు పి.బాలరాజు సమక్షంలో పార్టీ శ్రేణులతో నియోజకవర్గస్థాయి సమీక్షలో సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేకును సుబ్బారెడ్డి కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం భీమిలిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆధ్వర్యంలో వంద సచివాలయాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరించి చెప్పడం అభినందనీయమన్నారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి పరితపించే ముత్తంశెట్టిని రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం వంద సచివాలయాల్లో దిగ్విజయంగా పూర్తిచేయడానికి సహకరించిన పార్టీ కేడర్, అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల అండదండలతోనే ఇది సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో తను పోటీలో ఉన్నా, లేకుంటే అధిష్టానం ఎవరిని బరిలో నిలిపినా, వైసిపి విజయమే లక్ష్యంగా అందరం సమిష్టిగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మూడు జిల్లాల వైసిపి యువజన విభాగం అధ్యక్షులు ముత్తంశెట్టి శివ నందీష్‌బాబు, నేతలు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం, తాటిచెట్లపాలెం సంతోషిమాతకాలనీలో చిరత నవీన్(23! తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాడు. వారం రోజుల కిందట పెళ్లి చేసుకుందాం అని అడగ్గా ఆమె నిరాకరించించడంతో మనస్తాపానికి గురై, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అందిన సమాచారం మేరకు సంఘటనాస్థలాన్ని సందర్శించిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదనపు ఆశా వర్కర్‌ను నియమించాలి

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని కష్టాపురం గ్రామానికి ఖాళీగా ఉన్న స్థానంలో అదనపు ఆశావర్కర్‌ను నియమించాలని గ్రామ సర్పంచ్ లక్ష్మీ భవాని ఆదివారం ప్రకటనలో కోరారు.. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కృష్టాపురంలో మూడు వేల జనాభా ఉన్నారని, వీరందరికీ ఒకే ఆశావర్కర్ పనిచేస్తుండడంతో పనిభారంతో ఆమె, సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మరో ఆశావర్కర్ ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాలతో ఎనిమిదేళ్ల క్రితం ఆమె మానేయడంతో ఆ తర్వాత వేరొకరిని నియమించక పోవడంతో ఉన్న ఒకేఒక ఆశావర్కర్‌తో నెట్టుకొస్తున్నారన్నారు. ప్రజలు, రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అదనపు ఆశావర్కర్‌ను నియమించాలని సర్పంచ్ కోరారు.

ఉత్సాహంగా 'స్వచ్ఛతా హి సేవ'

స్వచ్ఛభారత్ అభియాన్ పిలుపుమేరకు స్వచ్ఛతా హిసేవ లో భాగంగా పలుచోట్ల శ్రమదానంతో పారిశుధ్య పనులను చేపట్టారు. (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

విశాఖపట్నం :పరిసరాల పరిశుభ్రత అందరూ బాధ్యతగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. స్వచ్ఛభారత్ అభియాన్ పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవాలో భాగంగా జివిఎంసి ఏక్ తారీఖ్-ఏక్ గంట శ్రమదానంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మలతో ఆర్‌కె బీచ్ వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో కాళీ మాత గుడికి ఎదురుగా ఆర్‌కె బీచ్‌లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. క్రెడాయ్ ప్రతినిధులు బయన శ్రీనివాసరావు, ధర్మేందర్ వరద, బివి శ్రీధర్ పాల్గొన్నారు. ఇందిరాగాంధీ జంతుప్రదర్శన శాలలో ఎయు ఎన్ఎస్ఎస్, వివిధ కళాశాలల విద్యార్థులు, ఆధ్వర్యంలో జిఎస్‌టి ఆడిట్ చీఫ్ కమిషనర్ సంజయ్ సంపత్, జాయింట్ కమిషనర్ నాగార్జున గ్రంధ, అసిస్టెంట్ కమిషనర్ పి.సురేష్, సిబ్బంది పాల్గొని స్వచ్ఛభారత్ చేపట్టారు. జూ క్యూరేటర్ డాక్టర్ నందిని సలారియ కృతజ్ఞతలు తెలిపారు. జివిఎంసి భీమిలి జోన్ చేపలుప్పాడ, కె.నగరపాలెం, భీమిలి బీచ్, గొల్ల వీధి, కృష్ణాకాలనీ, తగరపువలస మార్కెట్ ఏరియా, చిట్టివలస ప్రాంతాల్లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో తొట్లకొండ వద్ద సముద్ర తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. కార్పొరేటర్లు అక్కరమాని పద్మ, గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, దౌలపల్లి కొండబాబు, జెడ్‌సి బొడ్డేపల్లి రాము పాల్గొన్నారు. 14వ వార్డు సీతమ్మధార హిల్ వ్యూ పార్కు వద్ద బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ స్థలాల్లో కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌లో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె రాజు పాల్గొన్నారు ఏడోవార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ ఆధ్వర్యంలో, మధురవాడ పిలకవానిపాలెంలో జివిఎంసి సిబ్బందితో స్వచ్ఛత ర్యాలీ చేశారు. జివిఎంసి 91, 92 వార్డుల పరిధిలోని బాజీ జంక్షన్ రామాలయం, గోపాలపట్నం రైతు బజార్ వద్ద స్వచ్ఛభారత్, శ్రమదాన కార్యక్రమాలు చేపట్టారు. జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు జెడ్‌సి మల్లయ్య నాయుడు, ఎఎంహెచ్ఒ కృష్ణంరాజు, రమణ, లాజర్, నారాయణరావు పాల్గొన్నారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీలో భీమిలి యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకటజగన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవచేపట్టారు. సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రమణ పాల్గొన్నారు. 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ చివరి బస్‌స్టాపు, దుర్గాబజార్, శివాజీనగర్ -2 సామాజిక భవనం వద్ద జివిఎంసి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపినేతలు స్వచ్ఛభారత్ చేపట్టారు. గాయత్రీ విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య పి సోమరాజు, ఉపాధ్యక్షుడు డి దక్షిణామూర్తి ఎంఎల్‌బిటి స్కూల్ ప్రిన్సిపల్ కె.మధురవాణి ఆధ్వర్యంలో వుడా పార్క్, బీచ్ రోడ్, ఈస్ట్ పాయింట్ కాలనీ, పాఠశాల ఆవరణలో పరిశు భ్రత కార్యక్రమాలు చేపట్టారు.పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.

అనకాపల్లి జిల్లాలో...

అనకాపల్లి గాంధీనగరం గాంధీ పార్కులో స్వచ్ఛత కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి పాల్గొని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. పార్కును శుభ్రం చేశారు. పల్లపు వీధి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైసిపి నాయకులు దాడి రత్నాకర్, కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు తుప్పలు, డొంకలు తొలగించారు. 84వ వార్డు నెయ్యిల వీధి, పిళ్ళవారి వీధిలోనూ, తుమ్మపాల పంచాయతీలోస్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. కశింకోట మండలం ఎన్‌.జి.పేటలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ ఆధ్వర్యాన వీధిని శుభ్రం చేశారు. బుచ్చయ్యపేట మండలం చింతపాకలో స్థానిక సర్పంచ్ గోలజాన శ్రీను ఆధ్వర్యంలో తుప్పలు, చెత్తాచెదారం తొలగించారు. సబ్బవరం మండలం మొగలిపురంలో ఎంపిపి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం-3లో శ్రమదానం చేశారు. విశాఖ డెయిరీ ఉమ్మడి జిల్లా పరిషత్ సిఇఓ పి.శ్రీరామమూర్తి పర్యవేక్షించారు. బోకం సూర్యకుమారి, ఎంపిడిఒ రమేష్ నాయుడు పాల్గొన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు ర్యాలీ చేశారు. వైసిపి నాయకులు కోన లచ్చన్న నాయుడు పాల్గొన్నారు. కె.కోటపాడు మండల కేంద్రంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో కాంద్రేగుల శశిదేవి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. పరవాడ మండలం లంకెలపాలెం, అగనంపూడి, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో 79వ వార్డు కార్పొరేటర్ ఆధ్వర్యాన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపిపి రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, ఏవో సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ శ్రమదానం చేశారు. రావికమతం మండలం కవగుంట, కొమిర, తదితర గ్రామాలలో శ్రమదానం చేపట్టారు. కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి పాల్గొన్నారు. చీడికాడ, అడవి అగ్రహారంలో సర్పంచ్ సలాది ధనలక్ష్మి, గంగ శేషు ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. రోలుగుంట పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓపిఆర్‌డి రవికుమార్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ఆవరణలో చెత్తా చెదారం తొలగించారు. గొలుగొండ మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో సర్పంచ్ పత్తి రమణ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఎఎంసి ఛైర్మన్ కొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు. కృష్ణదేవిపేట, కొత్తమల్లంపేట స్వచ్ఛత కార్యక్రమాలు జరిగాయి. బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట స్కూల్‌లో పరిసరాలను శుభ్రం చేశారు.

ప్రభుత్వరంగ సంస్థల్లో...

స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఎన్ఎస్‌టిఎల్‌లో నిర్వహించిన శ్రమదానాన్ని సంస్థ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎవిఎస్‌కె.కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ ,కల్నల్ బిపి ఆచార్య, మితిలేష్ కుమార్ సాహు, ఎన్ఎస్‌టిఎల్ సిబ్బంది గంటసేపు శ్రమదానం చేశారు. హెచ్‌పిసిఎల్ సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వినోద్ కుమార్ బిష్త్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం,ప్రకాష్‌నగర్‌లో పరిశుభ్రత పనులు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ సిఐఎస్ఎఫ్ విభాగం ఆధ్వర్యంలో లో మహాత్మాగాంధీ పార్కులో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. సిఐఎస్ఎఫ్ కమాండెంట్, స్టీల్ ప్లాంట్ శాంతిభద్రతల సిఐ, పాల్గొన్నారు. ఎన్‌టిపిసి సింహాద్రిలో స్వచ్ఛత డ్రైవ్ నిర్వహించారు. సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షులు అంజు సిన్హా సిజిఎం ఎస్ గోవిందరాజన్, ఎన్‌టిపిసి అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబాలు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, తిక్కవానిపాలెం సర్పంచ్,పాల్గొన్నారు.



విఎస్ఇజెడ్‌లో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ

స్వచ్ఛతాహి సేవ 3.0 లో భాగంగా విశాఖ స్పెషల్ ఎకనమిక్ జోన్(విఎస్ఇజెడ్)లో సోలార్ సబ్‌స్టేషన్, హెవీ వెహికల్ పార్కింగ్‌బే ప్రాంతాలను శుభ్రపరచడంతోపాటు ఫుట్‌పాత్‌లపై పిచ్చిమొక్కలను తొలగించారు. ఐఆర్ఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాళ్ల, రోహిణి అపరంజి కొరారి పాల్గొన్నారు .కార్యక్రమంలో లయన్స్, రోటరీ క్లబ్ ప్రతినిధులు, ప్లాంట్ విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, ప్రాచీన కట్టడాల పరిరక్షణకు కృషి

గీతం ఆర్కిటెక్చర్ హెరిటేజ్ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి- మధురవాడ : భారతీయ వారసత్వ సంపదలో ప్రాచీన కట్టడాలు అంతర్భాగమని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్, డీన్ ప్రొఫెసర్ విభూతి సచ్చదేవ్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రాచీన కట్టడాలలో ఒకటైన హవా మహల్‌లోగీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు సభ్యులుగా హెరిటేజ్ క్లబ్‌ను ప్రారంభించారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్అండ్‌కల్చర్ హెరిటేజ్ (ఇంటాక్), గీతం హెరిటేజ్ క్లబ్ సంయుక్త నిర్వహణలో విశాఖ హవామహల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జైపూర్ వంశపు రాజమాత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజమాత మాట్లాడుతూ, జైపూర్‌లోని జాల్‌మహల్ పునరుద్ధరణ కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొన్నానని, దానికిగాను తనకు లభించిన గుర్తింపును విద్యార్థులకు వివరించారు. ఇంటాక్ విశాఖ సభ్యుడు విశ్వేశ్వరపు ఎడ్వర్డ్‌పాల్ విశాఖపట్నం ప్రాచీన చరిత్ర, అందులో హవామహల్ నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ విశాఖపట్నం కోకన్వీనర్ డాక్టర్ సురేంద్రకుమార్ మాట్లాడుతూ, ప్రాచీన కట్టడాలపై అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, ప్రాచీన వారసత్వ సంపదను పరిరక్షణకు హెరిటేజ్ వాక్ వంటి కార్యక్రమాలను భవిష్యత్తులో తాము గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హెరిటేజ్ క్లబ్ సభ్యులు వెల్లడించారు.

నేడు శొంఠ్యాంలో ఆయుష్ కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీలో ఆయుర్వేద ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి సోమవారం సాయంత్రం 4గంటలకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేయనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులుబంక సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు. సచివాలయం కన్వీనర్లు కార్యకర్తలు, ముఖ్యనేతలు హాజరు కావాలని కోరారు.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



క్రీడాకారులతో కలిసి చెస్ ఆడుతున్న వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- సీతమ్మధార: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు ఆదివారం అక్కయ్యపాలెం పోర్టు ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 36వ నేషనల్ అండర్ -11 ఛాంపియన్స్ 2023 పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదరంగం క్రీడ మెదడును షార్ప్ చేస్తుందన్నారు.

ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి గేమ్ ఆడారు. ఇంతపెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె రాజు, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జివి) వైసిపి సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథం, చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్ అనిల్ కుమార్‌రాజు, శశికళ, ప్రమోద్, నరేంద్ర పాల్గొన్నారు.


అలరించిన నృత్యప్రదర్శనలు



శిల్పారామంలో కళాకారుల నృత్యప్రదర్శనలు

ప్రజాశక్తి-పిఎం పాలెం : మధురవాడ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సరస్వతి నృత్య కళామందిరం కళాకారుల శాస్త్రీయ, జానపద ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా స్వాగతం, మూషిక వాహన, బ్రహ్మ కడిగిన పాదము, తందనాన హరి, ఇట్టి ముద్దులడే బాలుడు, అదిగో అల్లదిగో , అన్నమాచార్య కీర్తనలు, ధన్ ధనా ధాన్, కొండ కోన, లేచింది గూడెం తదితర కీర్తనలను కళాకారులు హృద్యమంగా నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి సరస్వతి నృత్య దర్శకత్వం వహించగా, రిషిక సాయి, మమత శ్రీ, నందిని, చాందిని, సత్యస్వరూప, తన్వి లెనినా, చిరు హాసిని, రోషిణి, యశస్వి, ప్రణతి, భవ్య, మౌనిక కళాకారులు పాల్గొన్నారు. శిల్పారామం పరిపాలన అధికారి టి. విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

నెలరోజుల పాటు కలాం జయంత్యుత్సవాలు



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో అక్టోబర్ ఒకటి నుంచి నెల రోజులపాటు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, అబ్దుల్ కలాం ఆలోచనలను విద్యార్థులకు, యువతకు చేరువ చేయడమే తమ సంస్థ ముఖ్యోద్దేశ్యమన్నారు. విశాఖ, అనకాపల్లి, అరకు జిల్లాల్లో అబ్దుల్ కలాం విగ్రహాలు ఆవిష్కరిస్తామన్నారు. విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జి ప్రదీప్, కె నగేష్, సుధాకర్ పట్నాయక్, కె రామకృష్ణ, రాజారెడ్డి పాల్గొన్నారు

జివిఎల్ మాటలు నమ్మశక్యంగా లేవు!

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలపై కేంద్రం ప్రకటించాలి

962వ రోజు ఉక్కు రిలేదీక్షల్లో పోరాట కమిటీ నేతలు



దీక్షల్లో పాల్గొన్న పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ కరణ ప్రక్రియ ఆగిపోయిందని బిజెపి రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నర్సింహరావు చెబుతున్న వట్టి మాటలు నమ్మే స్థితిలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు లేరని, దీనిపై దీపం కమిటీతోగానీ, ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి, ఉక్కుశాఖ మంత్రులతో ప్రకటన చేయించాలని ఉక్కు పరిరక్షణ పోరాటకమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పోరాట కమిటీ చేపట్టిన రిలేదీక్షలు 962వ రోజుకు చేరిన సందర్భంగా స్టీల్ వైఎస్ఆర్‌టియుసికాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొనసాగిన రిలేదీక్షలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై మస్తానప్ప మాట్లాడుతూ, ప్రజల త్యాగాలు, భాగస్వామ్యంతో ఏర్పాటై, లాభాల బాటలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నష్టాల పాల్జేసి దాన్ని సాకుగా చూపి కార్పొరేట్లకు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు. అంతేకాక కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు కోడ్‌లుగా మార్చడం, ఇలా అడుగడుగునా కార్మిక, ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం, గడిచిన మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా, కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు నిరాటంకంగా సాగిస్తున్న ప్రభుత్వం ఇపుడు ఒక్కసారిగా మాటమార్చేసి, ప్రయివేటీకరణ లేదంటూ ప్రకటించడాన్ని నమ్మలేకపోతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధికోసమే ఎంపీ జివిఎల్ ఈ మేరకు ప్రకటన చేసినట్టుందన్నారు. ప్రయివేటుపరం చేస్తాం, కాదంటే మూసేస్తామంటూ ఇన్నాళ్లు బెదిరిస్తూ వచ్చిన వారు, ఇపుడు ప్రయివేటీకరణ లేదనడం నమ్మలేనట్టుందన్నారు. జివిఎల్ మాటలను ఇక్కడెవరూ నమ్మరని, దీనిపై ప్రధాని, స్టీల్‌మంత్రులతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై కేంద్రం నిర్ణయం వెనక్కు తీసుకునే వరకు ఉక్కు కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో , పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, కె రామస్వామి, ఎన్ రామారావు, వరసాల శ్రీనివాస్, మార్డుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, పిట్టారెడ్డి, దొమ్మేటి అప్పారావు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం లో పి శ్రీనివాస్ రాజు దాసరి పుల్లారావు బొడ్డ గోవింద్,చిత్రాడ వెంకటరమణ,టేకేటి శ్రీనివాస్, పిట్టా సంజీవ్ రెడ్డి,కణితి మహేష్ పాల్గొన్నారు.

అగనంపూడికి రైతుబజారు మంజూరుపై హర్షం

స్థలం కేటాయింపునకు కృషిచేసిన గాజువాక ఎమ్మెల్యేకు పౌరసన్మానం



పౌరసత్కార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడిలో రైతు బజార్‌కు సర్వేనెంబర్ 56లో 60 సెంట్లు స్థలం కేటాయిస్తూ జిఒ 571 విడుదలకు కృషిచేసిన గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి పూర్ణానంద శర్మ ఆధ్వర్యంలో 79వ వార్డు అగనంపూడి వేపచెట్టు దగ్గర పౌర సన్మానం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో అగ్రగామిగా ఉన్న అగనంపూడిలో చాలామంది వ్యాపారస్తులు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, ఫార్మాసిటీ కార్మికులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉన్నారన్నారు. వీరికి ప్రతిబుధవారం జరిగే వారపుసంత మాత్రమే కూరగాయలు, ఇతర నిత్యావసరాల కొనుగోలుకు అండగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో అగనంపూడిలో రైతుబజారు ఏర్పాటు చేయాలని పూర్ణానంద శర్మ రెండేళ్లుగా కృషి చేస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి చేయడంతో ఎట్టకేలకు రైతుబజారు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. కార్యక్రమంలో జగన్నాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సోమినాయుడు ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దానబాల చిన్నప్పలనాయుడు, నక్క రమణబాబు, వైసిపి నేతలు గుర్రం శీను, మామిడి రాము, ఎలమంచిలి చినప్పారావు, సాలాపు అచ్చిబాబు, తమ్మినహర్ష, చైతన్య, అప్పారావు, మూర్తి, బి రామారావు, బోస్ బాబు, పోల్ రెడ్డి, రవిచంద్ర రెడ్డి పాల్గొన్నారు ఈసందర్భంగా తిప్పల దేవన్‌రెడ్డి, జి పూర్ణానందశర్మలను కూడా సత్కరించారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపికి భంగపాటు తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న రాజబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మదంతో రెచ్చిపోతున్న వైసిపికి భంగపాటు, టిడిపికి అఖండవిజయం తథ్యమని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు ధీమా వ్యక్తం జేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీపట్ల ప్రజాదరణ విశేషంగా పెరిగిందని, రానున్న ఎన్నికల్లో మంచి మెజార్టీలో అధికారంలోకి వస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. అరాచక పాలనతో ప్రజల్లో అప్రతిష్ట మూటగట్టుకున్న వైసిపి, ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి లబ్ధిపొందాలని చూస్తున్న వైసిపి గుణపాఠం తప్పదన్నారు. అక్రమ కేసులో జైలుకెళ్లిన చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూక రాజు, భీమిలి రూరల్ మండల అధ్యక్షులు డిఎ న్ రాజు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె దామోదరరావు, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షులు బోయి రమాదేవి, తెలుగు రైతు నియోజక వర్గ అధ్యక్షులు బోర బంగారు రెడ్డి పాల్గొన్నారు

6న ఆటో కార్మికుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆటో కార్మికులను వేధిస్తున్న జిఒ 21ను రద్దు, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6న ఆటో కార్మికుల చలో విజయవాడను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆరిలోవ జోన్ శ్రీపైడిమాంబ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టాండ్‌వద్ద విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిఒ 21తో ఆటో కార్మికులపై వేధింపులు తీవ్రమయ్యాయన్నారు. దీనిని వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోలకు ఫొటోలు తీసి, ఈ చలానా విధించే విధానాన్ని మానుకోవాలని, విశాఖ నగర పరిధిలో ఆటోలకు రిజిస్ట్రేషన్ చేయాలని, నగరంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. చలో విజయవాడలో పెద్దఎత్తున ఆటో కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. సమావేశంలో స్టాండ్ అధ్యక్షులు సూరిబాబు, కార్యదర్శి గాడి సూరిబాబు, రమేష్, మహాలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

టిఎన్‌టియుసి నేత ఔదార్యం

బిటెక్ విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ వితరణ




ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ టిఎన్‌టియుసి అధ్యక్షులు నక్క లక్ష్మణరావు ఉదారతను చాటుకున్నారు. తన సొంత నిధులతో బిటెక్ చదువుతున్న పేద విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్‌ను అందజేశారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ శ్రీను కుమార్తె గాయత్రిరెడ్డి బిటెక్ చదువుతోంది. పేద కుటుంబానికి చెందిన గాయత్రికి తన సొంత నిధులతో ల్యాప్‌ట్యాప్‌ను సమకూర్చిన లక్ష్మణరావు, ఆదివారం విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. విద్యార్థిని ఉన్నత చదువులకు సాయం అందిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.తారక్ ,హిందుస్థాన్ షిప్‌యార్డ్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రంజాన్ ప్రసాద్, హెచ్‌పిసిఎల్ టిఎన్‌టియుసి నాయకులు క్లబ్ రమణ, నేవల్ డాక్ యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోక్కల కృష్ణ, కోరమండల్ ఫెర్టిలైజర్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి ఉరుకూటి హరియాదవ్, 59వ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి శంకర్, ఉపాధ్యక్షులు డొంకన రాంబాబు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన లీగల్ సెల్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : వైసిపి విశాఖ లీగల్ సెల్ అధ్యక్షుడు బాజినాయుడు, కన్వీనర్ విజయరెడ్డి ఆదివారం ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డిని విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందించారు. తమను లీగల్ సెల్ ప్రతినిధులుగా నియమించడంపై వారు ఆనందం వ్యక్తం చేసి, సుబ్బారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి లీగల్‌సెల్ సభ్యులు పాల్గొన్నారు



సుబ్బారెడ్డిని అభినందిస్తున్న వైసిపి లీగల్ సెల్ ప్రతినిధులు

జగనన్న కాలనీ లేఅవుట్‌లో

గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- రాత్రి వేళల్లో జెసిబితో తవ్వి, లారీల్లో తరలింపు
- వైసిపి నాయకుల కనుసన్నల్లోనేనని ఆరోపణలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని విఆర్‌ఒ
- రెవెన్యూ, మైనింగ్ అధికారుల పత్తాలేని వైనం

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలో గ్రావెల్ మైనింగ్ దందా జరుగుతోంది. పట్టణ జగనన్న కాలనీలకు భూములిచ్చిన పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం వేసిన లేఅవుట్‌లో రాత్రి వేళల్లో జెసిబితో గ్రావెల్ తవ్వకాలు చేసి లారీల్లో అక్రమంగా తరలించుకుపోతున్నారు. యథేచ్ఛగా ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నా ఇటు రెవెన్యూ, అటు మైనింగ్ అధికారుల పత్తాలేదు.

పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలో పట్టణ జగనన్న కాలనీల నిమిత్తం ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అధికారులు ఇదే రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 365లోని ప్రభుత్వ కొండపోరం బోకు భూమిలో లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను ఇంకా లబ్ధిదారులకు అప్పగించలేదు. ఈ నేపథ్యంలో ఈ లేఅవుట్‌లో గ్రావెల్ దందా మొదలైంది. ప్రతి రోజూ రాత్రి వేళల్లో జెసిబిలతో గ్రావెల్ తవ్వి లారీలతో చుట్టుపక్కల ఉన్న ఫార్మాసిటీ, అగనంపూడి, గాజువాక పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెదముషిడివాడలో ఒక చోటా వైసిపి నాయకుడు వేస్తున్న ఆనధికారిక లేఅవుట్‌లకు కూడా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ మైనింగ్‌పై స్థానిక విఆర్‌ఓ అప్పారావుకు అనేక సార్లు ఫిర్యాదు చేశామని, ఆయన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్ వెనుక స్థానిక అధికార పార్టీ నాయకుని హస్తం ఉందని, అందుకే స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఇటు రెవెన్యూ అధికారులుగాని, అటు పోలీస్, మైనింగ్ అధికారులుగాని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని, అక్రమ మైనింగ్ పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సంపదను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



వైసిపి నాయకుని లేఅవుట్‌లో వేసిన మట్టి



జగనన్న ఇళ్ల స్థలాల కోసం వేసిన లేఅవుట్‌లో మట్టి తవ్వకాలు చేసిన దృశ్యం



మాట్లాడుతున్న ఎస్ఐ సన్యాసినాయుడు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విద్యార్థులు మత్తు పదార్థాలు, పానీయాలకు దూరంగా ఉండాలని అచ్యుతాపురం ఎస్ఐ ఎస్.సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. కైట్స్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలు కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సన్యాసినాయుడు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ యువత చదువు, క్రీడలు పట్ల దృష్టి సారించాలన్నారు. చదువును వదిలి దురాలవాట్లకు లోనైతే జీవితం నాశనమవుతుందని చెప్పారు. వేడుకలకు విచ్చేసిన ఇండియన్ ఆర్మీ ఎన్‌సిసి ప్రతినిధి దేవి శంకర్ మాట్లాడుతూ దేశంలోనే ఎన్‌సిసి అతిపెద్ద ఆర్గనైజేషన్ అని, విద్యార్థులు శిక్షణ తీసుకొని దేశానికి సేవ చేయాలని కోరారు. కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందారని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, కైట్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆడారి అప్పలనాయుడు, కైట్స్ స్కూల్ కరెస్పాండెంట్ రెడ్డి గణేష్, డైరెక్టర్లు అడిగర్ల శంకరరావు, ఆడారి సన్యాసిరావు, విల్లూరి ప్రసాద్, సరిసా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి

గాంధీ జయంతిని పురస్కరించుకొని అనకాపల్లి పట్టణం జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గంగలకుర్తి భాగ్యలక్ష్మి సహకారంతో జరిగిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్, ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ రాధిక, ఎంహెచ్ స్కూల్ ప్రిన్సిపాల్ రుధిరా రాణి, గంగలకుర్తి భాగ్యలక్ష్మి చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల సభ్యులు బండి అప్పారావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజు, అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు అములోజు శ్రీను, తరిణి వాణి, సోషల్ మీడియా ఉప్పల సాయి, కొణతాల రాజు, చింతా లక్ష్మాజీ, సాయి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షులు దొగ్గ అన్నంనాయుడు రెండో వర్ధంతి సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అన్నంనాయుడు కుటుంబ సభ్యులు అనాథ ఆశ్రమంలో ఉన్న పేద పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ అన్నమునాయుడు పార్టీకి ఎన్నో సేవలు అందించారని, అనేక సమస్యలపై పోరాడి పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డు పాలవెల్లి, గొర్రెపోతు రమేష్, మలిరెడ్డి రాజు నాయుడు, గొర్రె దేములు, బండారు అప్పలనాయుడు, గవిరెడ్డి సింహ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న టిడిపి నాయకులు



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ముత్యాల సతీష్

అన్న సమారాధన

ప్రజాశక్తి -అనకాపల్లి

వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక బైపాస్ రోడ్ వద్ద ముఠా కార్మిక యూనియన్ ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ ప్రారంభించారు. అలాగే చోడవరం నియోజకవర్గ పరిధి ముద్దుర్తి గ్రామంలో శ్రీబాల గణపతి యువజన సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపాన్ని ముత్యాల సతీష్ సందర్శించి స్వామి వారికి పూజలు చేసి, అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు, ఎంవిఆర్ యువసేన సభ్యులు, సంజూబాబు టీం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆపన్న హస్తం

ప్రజాశక్తి- వడ్డాది

కష్టాల్లో ఉన్న పేద తల్లులకు, అనారోగ్య బాధితులకు స్థానిక యువకులు అండగా నిలిచారు. రూ.90వేలు నగదు సేకరించి వారికి అందజేశారు. వడ్డాది రెల్లివీధికి చెందిన వితంతువు ముత్యాల జ్యోతి ఇద్దరు పిల్లల పేరున రూ.40వేలు డిపాజిట్ చేశారు. పెద్ద బజారు వీధికి చెందిన మరో పేద మహిళ బేరా కొండాజీకి రూ.30వేలు, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మాడుగులకు చెందిన పెదబీర పెంటయ్య అనే యువకుడికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం వడ్డాదిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు సంబంధిత నగదును, డిపాజిట్ పత్రాలను అందించారు. ఆర్థిక సాయం చేసిన యువకులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొండా నారాయణమూర్తి, గిరిబాబు, శ్రీరామమూర్తి, 1994-95 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సురేష్, ఇంటి శ్రీను, ఆర్ఎంపి సంఘం ప్రతినిధులు అమిత్ కుమార్, విరాళ దాతలు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి దేశానికి తీరని లోటు

సంస్మరణ సభలో రైతు నాయకులు



స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ మృతి దేశానికి తీరని లోటని పలు సంఘాల నాయకులు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్మిక కర్షక నిలయంలో స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా డాక్టర్ స్వామినాథన్ చిత్రపటానికి రైతు సంఘం నాయకులు ఎ.బాలకృష్ణ, కర్రి అప్పారావు, కాళ్ల తేలయ్య బాబు, కోరిబిల్లి శంకర్రావు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు కాళ్ల ఏడుకొండలు, సిఐటియు, ఎఐటియుసి నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వైయన్ భద్రం తదితరులు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తిండిగింజలకు విదేశాలపై ఆధారపడే దుస్థితి నుండి దేశాన్ని రక్షించి ఆహార ధాన్యాల కొరతను తీర్చిన అనేకమంది శాస్త్రవేత్తల్లో డాక్టర్ స్వామినాథన్ అగ్రగణ్యులని పేర్కొన్నారు. ఆయన కృషి ఫలితంగానే ఆహార కొరత అధిగమించి మిగులుకు చేరుకున్నామన్నారు. భారత ప్రభుత్వం పరిశోధన కేంద్రాలను పటిష్టపరిచి దేశ ప్రజలందరి ఆహార అవసరాలను తీర్చే విధంగా చిత్త శుద్ధితో ప్రణాళికల రూపొందించి అమలు చేయాలని కోరారు. అందుకు డాక్టర్ స్వామినాథం చేసిన సిఫార్సులను బిజెపి కేంద్ర పాలకులు తూచా తప్పకుండా అమలు చేసి సంక్షోభాలను, వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించాలని డిమాండ్ చేశారు. కాని ఆ దిశగా మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతుల ఆత్మహత్యలను నివారించే విధంగా అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించి చట్టం చేయాలని, రుణ సౌకర్యం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

సుప్రీం కోర్టు అదేశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు అసంఘటిత కార్మికులు, వలస కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో గ్రామ/ వార్డు సచివాలయాలు, మీ సేవ సెంటర్ల ద్వారా తమ పేర్లను నమోదు చేసుకొని గుర్తింపు కార్డును పొందవచ్చని అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మెట్ట రమ్య తెలిపారు. అలా నమోదైన కార్మికులకు జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా ఆహార దినుసులు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన, లేదా పూర్తి అంగవైకల్యం పొందిన కార్మికులకు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందిస్తారన్నారు. వలస కార్మికులకు రేషన్ కార్డు కావాలనుకున్నా, ఎటువంటి సమస్యలున్నా జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్-ధాన్ (పిఎంఎస్‌వై) పథకం ద్వారా పెన్షను సౌకర్యం కల్పించడం జరుగుతుందని, అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉక్కు రక్షణ బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ



సూరెడ్డి పాలెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 5న కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ గేట్ వద్ద జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలు చోట్ల వాల్ పోస్టర్లను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు.

కె.కోటపాడు : మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో ఉక్కు బహిరంగ పోస్టర్‌ను సిపిఎం నాయకులు గండి నాయనబాబు, ఎర్ర దేవుడు ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఉక్కు పరిరక్షణ బహిరంగ సభకు తరలిరావాలని ఎ.కోడూరు, వారాడ, ఆర్‌వై.అగ్రహారం, సింగన్నదొరపాలెం, గవరపాలెం, పిండ్రంగి, దాలివలస గ్రామాలలో ప్రచారం చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు వత్తాసు పలకడం దారుణమని నాయకులు విమర్శించారు. పార్టీ సానుభూతిపరులు సతీష్, పైడినాయుడు, నరసింహమూర్తి, దేవుడు నాయుడు పాల్గొన్నారు.

పరవాడ : మండలం కేంద్రం పరవాడలో చలో స్టీల్‌ప్లాంట్ బహిరంగ సభ గోడ పత్రికను విడుదల చేశారు. బంగారు బాతు లాంటి స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మడానికి పెట్టడం దారుణమని నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ ఉద్యమం ప్రారంభించిన నాటి నుండి సిపిఎం ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.వి.రమణ, గనిశెట్టి సత్యనారాయణ, అనకాపల్లి నాగేశ్వరరావు, ఎ.బంగారు రాజు, ఎ.రాంబాబు, పెండ్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక దుర్గమాంబ ముఠా కళాసీ సంఘ కార్యాలయ ఆవరణలో చలో స్టీల్‌ప్లాంట్ బహిరంగ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఆర్.శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల 5న బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉప్పాడ సత్యవతి, పప్పుల కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, యర్రా సోంబాబు, సోము నాయుడు, వంకర చిన్ని కష్ణ,సోమేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాజు ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా సంవత్సర కాలంగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు విద్యార్థులు, యువజనులు, కార్మికులు కలిసిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రమణ, అర్జున్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు బి.నాగేశ్వరరావు, ఎం.రాజేష్ గోడ పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, 32 మంది బలిదానం ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కును బిజెపి ప్రభుత్వం అడ్డగోలుగా అమ్ముతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.రాజాబాబు, జి.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఉక్కు రక్షణ బైక్‌యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 5న కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు కోరారు. ఆదివారం 76వ వార్డు రామచంద్రనగర్‌లో రిక్షా కాలనీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ వల్లే గాజువాక ప్రాంతం అభివృద్ధి చెందిందని, ఇపుడది ప్రయివేటు చేతుల్లోకి వెళితే అసంఘటితరంగ కార్మికులు బతుకు దుర్భరమౌతుందన్నారు.కార్యక్రమంలో గాజువాక జోన్ సిఐటియు అధ్యక్షులు డి.రమణ, రాజారావు, త్రినాథ, రామ్మూర్తి, రాము, లక్ష్మణరావు, చిన్నారావు, కార్మికులు పాల్గొన్నారు.



సబ్బవరంలో..



గాజువాక రిక్షా కాలనీలో..



బైక్ యాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గంగారావు

అగనంపూడిలో బైక్‌ర్యాలీ

ఉక్కునగరం : ఈనెల 5న సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఉక్కు రక్షణ బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం అగనంపూడిలో బైక్ ర్యాలీ చేపట్టారు. బైక్‌ర్యాలీని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీనియర్ నాయకులు సిహెచ్ నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 20 నుంచి సిపిఎం ఆధ్వర్యంలో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో సుమారు 1500 కిలోమీటర్లు ఉక్కు రక్షణ బైక్ యాత్ర జరిగిందని, దీనికి అడుగడుగునా విశేష స్పందన వచ్చిందని తెలిపారు. బైక్ యాత్ర ముగింపు సందర్భంగా 5న సాయంత్రం 4 గంటలకు కూర్మన్నపాలెం ఆర్చ్ నిర్వహించే బహిరంగసభలో సిపిఎం జాతీయప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని తెలిపారు. అగనంపూడిలో ఉన్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు భారీ ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నేత పి నీలకంఠం, ఉరిటి మరిడయ్య, చిత్ర అబ్బాయి, పట్టా రమేష్, మంకోటి, ఉరిటి అప్పలరాజు, వంకర రాము, డి సత్యనారాయణ, శ్రీనివాసరావు శీరంశెట్టి, యలమంచిలి శ్రీనివాసరావు, కొయ్య సింహాద్రి,చట్టి నర్సింగరావు, గణేష్, గెద్దాడ రమేష్ , ఆంజనేయులు, చట్టి అంజి, మంచాల కన్నారావు, డి అర్జున్, శనివాడ అప్పారావు, పట్టా నర్సింగరావు, చట్టి నూకరాజు, శివ పాల్గొన్నారు.



రిటైర్ అయిన తోటివారిని సన్మానిస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 32 సంవత్సరాల క్రితం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కొండకర్ల ఆవ పరిసర ప్రాంతాల్లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకొని పలకరించుకున్నారు. వారి మంచి చెడ్డలు బాగోగులు కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఏరా ఎలా ఉన్నావ్ పిల్లలు ఏం చేస్తున్నారు? అందరూ బాగానే ఉన్నారా అనే మాటలతో సంభాషించుకున్నారు. కొండకర్ల ఆవలో బోట్ షికారు చేసి ఆనందంగా ఉల్లాసంగా గడిపారు. పదవీ విరమణ చెందిన మిత్రులను ఈ సందర్భంగా సాల్వా కప్పి, పండ్లు పువ్వులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాము, సూరిశెట్టి శ్రీనివాస్, కర్రి ఆది నాగేశ్వరరావు, జనపరెడ్డి శ్రీనివాసరావు, బుద్ద వెంకట సత్యరామ్, పెంటకోట లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసన దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్టోబర్ 2వ తేదీన రాజమండ్రి సెంట్రల్ జైల్లో నిరాహార దీక్ష చేస్తున్న నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చన్నాయుడు ఆదేశాల అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా నిరాహార దీక్షలు చేపట్టాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక రింగ్ రోడ్‌లోని పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ నారాయణరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, బోడి వెంకటరావు, బొడ్డేడ మురళి, ధనాల విష్ణు చౌదరి, గుడాల సత్యనారాయణ సాలాపు నాయుడు డివి అప్పారావు, కుప్పిలి జగన్ తదితరులు పాల్గొన్నారు.

6న వైసిపి కేడర్‌కు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం, రావికమతం మండలాల వైసిపి కేడర్‌కు ఈ నెల 6న శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో గెలుపు ఎంత అవసరమో అన్న దానిని కార్యకర్తలకు వివరించేందుకు, వారి ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చోడవరం మండలం లక్కవరం గ్రామంలో 6న ఉదయం 9 గంటలకు, రావికమతంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వైసిపి ప్రజాప్రతినిధులు, గ్రామ వాలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

భూమి పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని మర్రివలస గ్రామంలో జగనన్న భూహక్కు రీసర్వే అనంతరం రైతులకు పాస్ పుస్తకాలను గ్రామ సర్పంచ్ పొంతపల్లి అప్పలనరసమ్మ , వీఆర్వో రత్నకుమారి, ఆధ్వర్యాన ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర్రివలస గ్రామంలో ఎన్నో ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్న భూములకు పాస్ పుస్తకాలు లేవని, ఇటీవల రీ సర్వే పూర్తి అవడంతో గ్రామంలో 350 మంది రైతులకు ఒకే దఫా పాస్ పుస్తకాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎ నాయకులు రెడ్డి అప్పలనాయుడు, సీమునురు సూర్యనారాయణ, సీమునురు రామనాయుడు, రవి నాయుడు, అప్పలకొండ, కొటాన సూరి దేవుడు తదితరులు పాల్గొన్నారు.



భూమి పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న రెవెన్యూ అధికారులు



మాట్లాడుతున్న కృష్ణ అప్పారావు

పిఏసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీ గౌరీ పిఎసిఎస్ (రైతు సంఘం బ్యాంకు) మహాజన సభ సంఘం కార్యాలయంలో (వివి రమణ సహకార భవనంలో) ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా సంఘం వ్యవస్థాపకులు కీర్తిశేషులు వివి రమణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షులు కాండ్రేగుల కృష్ణ అప్పారావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి బాటలో నడుస్తుందని తెలిపారు. 2022 -2023 సంవత్సరానికి గాను సంఘ సభ్యులకు 7.5 శాతం డివిడెంట్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ కర్రి మోదినాయుడు, విల్లూరు రాము, కొణతాల రామ సూర్యనారాయణ, సంస్థ కార్యదర్శులు త్రినాథ్, ప్రసాదు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు అనకాపల్లి జిల్లా జట్టు ఎంపిక ఈనెల 2 సోమవారం ఉదయం 8 గంటలకు అనకాపల్లి జూర్జ్ క్లబ్‌లో నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ కె.విష్ణుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13 నుంచి 16వ తేది వరకూ అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే పురుష, మహిళా జట్లు, అండర్ 17 బాల బాలికలను ఎంపిక చేయడం జరుగుతుందని ప్రెసిడెంట్ ఎ.రామకృష్ణ, సెక్రటరీ యల్లపు శ్రీనివాసరావు, కోశాధికారి హరి, దాడి బుజ్జి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 9441149808 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు సేవా సంఘం వ్యవస్థాపకులు పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరు, అనకాపల్లి మెయిన్ రోడ్ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను వివరించి అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు భీశెట్టి వరాహ సత్యవతి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, ఏఎస్ఐ మణికుమారి, యువభారత్ అధ్యక్షులు సూది కొండ మాణిక్యాలరావు, వి నిలేష్ గుప్తా, కొత్తూరు సర్పంచ్ సబ్బవరపు లక్ష్మి ప్రసన్న, పిరాట్ల నాగేశ్వరరావు, కొత్తూరు వాలంటీర్ ఫణి తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న దృశ్యం



మృతి చెందిన గేదె వద్ద బాధిత రైతు

రేబిస్ వ్యాధితో గేదె మృతి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలోని ఆర్ భీమవరం గ్రామంలో రైతు శానాపతి నాయుడుకు చెందిన గేదె రేబిస్ వ్యాధితో ఆదివారం మృతి చెందింది. ఈ గేదెను కొద్దిరోజుల క్రితం పిచ్చికుక్క కలవడంతో గమనించిన యజమాని నాయుడు నాటి నుండి వైద్యం చేయిస్తున్నాడు. అయినా ఉపయోగం లేక పోయింది. రేబిస్ వ్యాధితో గేదె మృతి చెందని రైతు నాయుడు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందని నాయుడు చెప్పాడు.

ఘనంగా పశువుల పండగ

ప్రజాశక్తి-కె.కోటపాడు

: మండల కేంద్రం కె.కోటపాడులో ఆదివారం పశువుల పండగ ఆ గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు తీసుకున్నారు. పశువులన్నింటిని ఒక చోట చేర్చి వాటి చుట్టూ మూడుసార్లు డబ్బులు వాయిద్యాలతో ప్రదర్శన చేశారు. ఈ పండగలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధ ఓటర్లకు ఘన సన్మానం



కరాసలో సన్మానిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కరాస: 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధ ఓటర్లను గౌరవించి, కృతజ్ఞతలు తెలియజేయాలన్న ఎన్నికల సంఘం సూచనల మేరకు పశ్చిమ నియోజకవర్గం, 24వ పోలింగ్ బూత్‌లో అత్యధిక సార్లు ఓటుహక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లు, 57వ వార్డు ఆశివానిపాలెం 190 పోలింగ్ బూత్ ఓటరు 85ఏళ్ల సూరెడ్డి దేముడమ్మను, అదేవిధంగా కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట 205 పోలింగ్ కేంద్రం ఓటరు 82ఏళ్ల మెట్టా సత్యనారాయణమూర్తి, 81ఏళ్ల బొడ్డేటి కొండమ్మలను ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, గోపాలపట్నం తహశీల్దార్ కొర్ర జయ, డిప్యూటీ తహశీల్దార్ సయ్యద్ జిలానీ దుశ్శాలువాతో సత్కరించారు. లక్షలాది మంది యువ ఓటర్లకు స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు. కార్యక్రమంలో బిఎల్‌ఓ కిషోర్ కుమార్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు విలేజ్ రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో సర్పంచ్ పోలిరెడ్డి రాజబాబు, ఎంపిటిసి బి.సీత చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులను సన్మానించడం మంచి విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రినాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సీనియర్ సిటిజన్స్‌ను బిఎల్వోలు ఘనంగా సన్మానించారు. ఓటు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఓటు వేస్తున్న వృద్ధులకు సాలువాలు కప్పి సత్కరించారు.

నర్సీపట్నంటౌన్: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో తహసిల్దార్ అన్నాజీరావు వృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, అనేకసార్లు ఎన్నికలలో ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గౌరవించిన వృద్ధులను సన్మానించడం ఆనందదాయకమన్నారు. ప్రభుత్వం పకడ్బందీగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తుందన్నారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి సూర్యనారాయణ తో కలిసి ఆయన వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి సుధావాణి, ఆర్‌ఐ వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణరావు, వి ఆర్‌ఓలు రాజుల నాయుడు, కమల పాల్గొన్నారు.



నర్సీపట్నంలో సన్మానిస్తున్న తహశీల్దార్



పెన్షన్ అందచేస్తున్న కౌన్సిలర్ బుల్లిదొర

కిడ్నీ బాధితుడికి పింఛను పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎం.రాముకి నూతన పెన్షన్‌ను 15వ వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బుల్లిదొర మాట్లాడుతూ, ఈ వ్యాధితో బాధపడుతున్న రాము పరిస్థితి ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, దీంతో ప్రభుత్వం రూ.10000 పింఛను మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు ఇంచార్జ్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

లైబ్రరీలో 'చదవడం మా కిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ: చదవడం మాకిష్టంలో భాగంగా గొలుగొండ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజబాబు ఆధ్వర్యంలో బుక్ రీడింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ బాలుర హాస్టల్ నుండి 17 మంది పాల్గొన్నారు.

మత్స్యకారుల పూజలు

ప్రజాశక్తి-గొలుగొండ: ఎర్రవరంలో అడవిరాజుల బాబు గుడి వద్ద అదివారం గ్రామానికి చెందిన మత్స్యకారుల సంఘం ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభ్యులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, సంఘం అద్యక్షుడు కొండబాబు, కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

వారాహియాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చీడికాడ: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టే 4వ దశ వారాహి యాత్రను విజయవంతం చేయాలని మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకుల రాయపరెడ్డి కృష్ణ పిలుపునిచ్చారు. అప్పలరాజు పురం, ఎల్బీ పట్నం గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.



బొర్రా గుహల్లో పర్యాటకులు

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి- అనంతగిరి: అనంతగిరిలో ప్రముఖ పర్యాటక కేంద్రాలకు వేలాదిమంది పర్యాటకులు పోటెత్తారు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ఉద్యోగు లు కుటుంబాలతో తరలి వచ్చారు. అనంతగిరి, బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలతో పాటు డమ్ముకు, సుంకరమట యు పాయింట్, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ తదితర ప్రాంతాలు కిటకిట లాడాయి. కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు. బొర్రా గుహల ఏర్పడిన విధానంపై గాడ్స్, సిబ్బందిని పర్యాటకులు అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ అంతరాయంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

కొనసాగిన 'బాబుతో నేను'



నక్కపల్లిలో నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి -యంత్రాంగం: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ చేపట్టిన బాబుతో నేను కార్యక్రమం ఆదివారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో కొనసాగింది. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ నేతలు నినాదాలు చేశారు.

కశింకోట: కశింకోట మండలం చింతలపాలెంలో ఇంటింటి వెళ్లి బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు కర్రి దుర్గ నాయుడు, మేడిశెట్టి వెంకట రమణ, జెర్రిపోతుల నూకునాయుడు, బుద్ధిరెడ్డి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా మండలంలోని గవరవరంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, నాయకులు గూనూరు మల్లునాయుడు, బొడ్డేడ నాగగంగాధర్, మాజీ ఎంపిపి గూనూరు పెదబాబు, గవరవరం మాజీ సర్పంచ్ ఎం.వెంకట స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మేము సైతం చంద్రబాబు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరిపాకలో స్థానిక టీడీపీ నాయకుడు వి.రమేష్ రాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి రవి కుమార్, గండి ముత్యాల నాయుడు, గండి దేముడు, బర్ణికాన బాబురావు, కోటాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలో బవులవాడ దర్జీ నగర్ కాలనీలో టీడీపీ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 23వ రోజుకు చేరాయి. టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కోట్ని బాలాజీ, మళ్ళ సురేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ విమర్శించారు. మండలంలోని రాజయ్యపేట సముద్ర తీరంలో ఆదివారం చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి, జనసేన శ్రేణులు సంయుక్తంగా నిరసన చేపట్టారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబు నాయుడు ను అరెస్టు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, డిఎల్ పురం ఎంపీటీసీ సభ్యులు కనకారావు, రాజయ్యపేట గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, నాయకులు పిక్కి సత్తియ్య, బాబూరావు, రాంబాబు, లోవరాజు, చిన్నారి, గోపి, రామకష్ణ, బుజ్జి, అప్పలరాజు, కోదండరావు, రమణ, అప్పారావు, రాజారావు, తాతాజీ పాల్గొన్నారు.

రోలుగుంట: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో ఎంపిటిసి సుర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. హారన్ మోత మోగిస్తూ గ్రామ పురవీధుల్లో తిరిగారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ: చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని లింగంపేట పంచాయతీలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మరిసా వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, లింగంపేట సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచులు పరవాడ అప్పలనాయుడు, ఆదపురెడ్డి ప్రభాకర్, లగుడు నానిబాబు, అనకాపల్లి జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గోలకొండ శ్రీకాంత్, గొర్లి సత్తిబాబు, లగుడు సత్యవేణి, అగ్రహారపు రత్నం, మిడతాన సూరిబాబు, గొంతిన తాతాజీ, ఎం నర్సింగ్ రావు, మాజీ నూకాంబికా ట్రస్ట్ చైర్మన్, నెల్లూరు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ టిడిపి కార్యాలయంలో 72 గంటలు నిరాహార దీక్ష చేపట్టిన టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎంవి.ప్రణవ్‌గోపాల్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు మొల్లేటి కుమార్ స్వామి, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఊరుకూటి డేవిడ్, కోట నరేష్, షేక్ రహమతుల్లా, పాశర్ల తరుణ్, ఆదిత్యలకు దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జి ఆదివారం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న నేతలు

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: అనకాపల్లి జిల్లా లో ఎన్నడూ లేని విధంగా కరువు నెలకొందని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలో సీతమ్మపాలెం, వెదుళ్ళపాలెం గ్రామాలలో ఆదివారం రైతులతో కలిసి పంటలు వేయకుండా ఖాళీగా ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో ఈ సమయానికి 2 లక్షల 4 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా ,కేవలం ఇప్పటికి 82 వేల ఎకరాల్లోనూ, నక్కపల్లి మండలం లో 4,688 ఎకరాలకు గాను కేవలం 1,219 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయన్నారు. వేసిన వరి నాట్లకు పరిస్థితులు అనుకూలించక పోవడంతో అధిక పెట్టుబడులు పెట్టినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రైతుల రుణాలు మాఫీ చేసి, తెలికపాటి విత్తనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, రైతులు ఈ.కొండయ్య, వై.సన్యాసిరావు, జీ.నూకరాజు, జీ.అప్పలనాయుడు, ఎం. నాగేశ్వరరావు, సిహెచ్. సింహాచలం, కె.రమణ, రైతులు పాల్గొన్నారు.

అద్భుతం..గాంధీజీ ముఖచిత్రం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన కళా నైపుణ్యంతో మహాత్మా గాంధీ ముఖ చిత్రాన్ని ఆవిష్కరించాడు .అక్టోబర్ 2 గాంధీజీ జయంతి పురస్కరించుకుని ధర్మకోల్ షీట్ పై హారతి కర్పూరంతో మహాత్ముని ముఖ చిత్రాన్ని ఆవిష్కరించాడు. పలువురు రవిని అభినందించారు.పలు పర్వదినాల్లో రవి తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడం తెలిసిందే.



గాంధీజీ ముఖచిత్రం



దరఖాస్తులు స్వీకరిస్తున్న సొసైటీ నేతలు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీని నెరవేర్చాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు జి.జనార్ధనరావు, అధ్యక్ష, కార్యదర్శులు బి.రవికాంత్, వై.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆదివారం నాటికి 600 మంది వరకు సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తుందనే అశా భావాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారిధిగా మీడియా ఉంటే, దానికి వెన్నుముకగా జర్నలిస్టులు ఉన్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి ఎ.శరత్ కుమార్, సలహాదారులు పి.సత్యనారాయణ, డి.రవికుమార్, ఉపాధ్యక్షులు కె.పరుశురాం, మురళీకృష్ణరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శులు అనూరాధ, బందరు శివప్రసాద్, కుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

55 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండల కేంద్రంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 55 కేజీల గంజాయి, రూ.85,500 నగదు స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్ర వాహనదారున్ని ఆపి తనిఖీ నిర్వహించగా గంజాయి, నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ద్విచక్ర వాహనతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా కుమ్మిడి సింగి పంచాయతీ గద్దెరాయ గ్రామానికి చెందిన వంతల కొండబాబు గా గుర్తించారు. నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు సామూహిక మరుగుదొడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అరకులోయ:గాంధీ జయంతిని పురస్కరించుకొని అరకులో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అరకు స్వచ్ఛతా కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద్ర డైరెక్టర్ శోభ సోమేశ్వరి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ప్రపంచ చిత్రపటంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న అరకులో స్వచ్ఛతకు సంబంధించి తొలి అడుగులు వేయబోతున్నామని ఆమె అన్నారు. దీనిలో భాగంగానే సోమవారం అరకు మండల కేంద్రంలోని సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నామన్నారు.

పరిహారం చెల్లించే వరకు

భూముల జోలికి రావద్దు

అమలాపురంలో మత్స్యకారుల ర్యాలీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు రెవెన్యూ పరిధిలో అమలాపురం గ్రామానికి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన భూములకు పరిహారం చెల్లించే వరకు భూములు జోలికు రావద్దని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలోని అమలాపురంలో ఆదివారం సంఘానికి సంబంధించిన మత్స్య కారులు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ, శ్రీ కనకమహాలక్ష్మి సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన సర్వే నెంబర్ 410/4, 417,418 లలో 43.15 ఎకరాల భూమిని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు పరిశ్రమల స్థాపన కోసం అధికారులు సేకరించడం జరిగిందన్నారు.ఏపీఐఐసీ అధికారులు సేకరించిన జిరాయితీ భూములకు రైతులకు ఏ విధంగా నష్టపరిహారం చెల్లించారో అదేవిధంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి కూడా పరిహారం చెల్లించాలని, మత్స్యకారులకు ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకు భూముల జోలికి రావద్దని, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రారంభించారు..సౌకర్యాలు మరిచారు...


-నిరుపయోగంగా భవనాలు
-డిజిటల్ లైబ్రరీ భవనంలో కానరాని సౌకర్యాలు
-వినియోగంలోకి రాని షాపింగ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా భవనాల నిర్మాణాలు చేపడుతున్నా అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీలకు గాను ఆరు పంచాయతీలలో నిర్మించ తలపెట్టిన డిజిటల్ లైబ్రరీ భవనాలకు గాను ఒక్కగానొక్క డిజిటల్ లైబ్రరీ భవనం గొట్టువాడ గ్రామంలో రూ.17 లక్షలతో నిర్మాణం పూర్తయింది. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు గడపగడపకు మన ప్రభుత్వంలో గత మే నెలలో ప్రారంభించారు. ఉత్తరాంధ్రలోని మొట్ట మొదటి డిజిటల్ లైబ్రరీ భవనం ప్రారంభం ఆర్భాటంగా చేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారులు అటువైపు చూసిన దాఖలాలే లేవు. అట్టహాసంగా ప్రారంభించిన ఆ భవనంలో ఎటువంటి ఫర్నిచర్ లేదు. లైబ్రరీ కి అవసరమైన సామగ్రి కూడా లేక పోవడంతో వృధాగా దర్శనమిస్తుంది.



డిజిటల్ లైబ్రరీ ఇదే..

అదేవిధంగా లింగాపురం సెంటర్లో 17 లక్షలతో నిర్మించిన సుమారు 15దుకాణల సముదాయం కూడా స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ సముదాయం ప్రారంభించి సంవత్సర కాలం పూర్తవుతున్నా నేటికీ విని యోగంలోకి తీసుకురాలేదు. కాంప్లెక్స్ సముదా యానికి అధికారులు వేలంపాట నిర్వహించి అధిక మొత్తం చెల్లించే వారికి ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే షాపులకు స్థానిక నాయకులు అడ్వాన్స్ తీసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భవనాలు వృధాగా ఉండకుండా అందుబాటులోకి తీసుకురావాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

దాతల దాతృత్వం

-తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావుకు పలువురు ఆర్థిక సహాయం
ప్రజాశక్తి, తదితర పత్రికల్లో కథనాలకు స్పందన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటకు చెందిన పడమటి శ్రీనివాసరావు కుటుంబానికి పలువురు దాతలు ఆర్థిక సాయం చేస్తూ తమ ఉదారతను చాటు కుంటున్నారు. పడమటి శ్రీనివాసరావు ప్రయివేట్ ఉపాధ్యాయునిగా పలువురు విద్యార్థులకు విద్యను అందించారు. ఆయన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరడం, అదే విధంగా అతని తల్లి గుండె సంబంధిత వ్యాధితో అనారోగ్యం పాలు కావడం, తండ్రి వృద్ధాప్యంతో కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. శ్రీనివాసరావు పరిస్థితిపై

ప్రజాశక్తితో పాటు పలు పత్రికలు, సోషల్ మీడియాలో కథనాలు రావడంతో దాతలు స్పందించారు. గ్రామానికి చెందిన ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు రూ.60 వేల ఆర్థిక సాయం అందించగా తన తోటి మిత్రులు గుడాల గంగాధర్, కోట మహేష్ సహచర స్నేహితులతో కలిసి రూ.40వేలను శ్రీనివాసరావుకు అందజేశారు. కొత్తకోట గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ యూత్ రూ 15 వేలు, గ్రౌండ్స్ బాయ్స్ యూత్ రూ 10 వేలు, ఉల్లూరి రాజు కుటుంబం రూ 10 వేలు, ఆంగ్ల ఉపాధ్యాయులు కె.రాజేంద్ర కుమార్ రూ 5 వేలు, చికెన్ సెంటర్ యజమాని రావాడ వరాహల రెడ్డి రూ.5వేలు, విశ్రాంతి పోస్ట్‌మెన్ పులిగా అచ్యుత్‌రావు, వైసీపీ నాయకులు శీలం దొరబాబు, శీలం శంకరరావు, బెతా పాండు, గుమ్ముడు దొరబాబు, కొన లోవరాజు రూ,2 వేల చొప్పున అందజేశారు. తోటి స్నేహితుడు కలగర్ల కిరణ్‌కుమార్ శ్రీనివాసరావు పరిస్థితిని చూసి చలించి తనకు తెలిసిన వారందరికీ వాట్సాప్ గ్రూపులో పరిస్థితిని తెలియజేశారు. ఈ విధంగా సేకరించిన నగదు రూ.42,400లను శ్రీనివాసరావుకు కిరణ్‌కుమార్ ఆదివారం అందజేశారు. కొత్తకోట జెడ్పి హైస్కూల్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్ పి.సూర్యనాగమణి వెయ్యి రూపాయల నగదు, బియ్యం, కూరగాయలను అందజేశారు. 2010 టెన్త్ బ్యాచ్ కు చెందిన వారు రూ.26వేలు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు కన్నయ్యదొర ఫోన్ పే ద్వారా దాతల నుంచి సమకూర్చిన 25,401ల నగదును శ్రీనివాసరావుకు అందజేశారు.



రూ.42,400 నగదును అందజేస్తున్న కిరణ్‌కుమార్